నరక 'దారులు'


చలివాగు వంతెనపై గుంతలమయంగా జాతీయ రహదారి


సీఎంఎస్, బస్టాండ్ కూడలిలో..

- నాణ్యతలేని రోడ్డు పనులతో జాతీయ రహదారి గుంతలమయం
- ప్రమాదాలతో ఆందోళన చెందుతున్న వాహనదారులు

హన్మకొండ(పరకాల): రోడ్డెక్కడమే పాపం..క్షణాల్లో ప్రాణాలు గాలిలో కలవటమో, తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలు కావడం సాధారణంగా మారుతుంది. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కాంట్రాక్టర్ కక్కుర్తితో అమాయక ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హనుమకొండ జిల్లా గూడెపోహడ్ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చెల్పూర్ వరకు 353 జాతీయ రహదారి నిర్మాణ పనులు రూ.కోట్ల నిధుల వ్యయంతో చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ప్రజాప్రతినిధి కావడంతో రోడ్డు పనుల్లో ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటా అంతా నా ఇష్టం అన్నట్లు చేపట్టారు. నిత్యం ఇసుక లారీలు, బొగ్గు లారీలు నడిచే రోడ్డు కావడంతో రహదారి అంతా కుంగిపోయింది. భారీ వాహనాల టైర్ల భాగమంతా కుంగిపోయి ఉండటంతో ద్విచక్ర వాహనాల నుంచి మొదలు టాటా ఏస్, ఆటోలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గుంతలను తప్పించే ప్రయత్నంలో వాహనాలు అదుపు తప్పి పడిపోతుండటం లేదా ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. జాతీయ రహదారి నిర్మాణం తర్వాత ప్రమాదాలు తగ్గుముఖం పట్టాల్సింది పోయి పెరగటంపై వాహనాదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ మాత్రం రోడ్డు వేసి చేతులు దులుపుకోవడంతో ప్రమాదాల నియంత్రణకు పోలీసు అధికారులు కాంక్రీట్‌తో చేసిన మరమ్మతు తప్పా మళ్లీ పట్టించుకున్న నాథుడే కరువయ్యారు.

నియంత్రణ చర్యలు తీసుకోవాలి..



ఒకవైపు దూసుకొస్తున్న లారీలు.. మరోవైపు గుంతలమయంగా ఉన్న రోడ్లతో ఎంతో మంది ప్రాణాలు పోతున్నాయి. రెండు వారాల క్రితం రోడ్డు దాటుతున్న ఓ విద్యాసంస్థ యజమానిని బస్సు ఢీకొట్టింది. స్పీడ్ బ్రేకర్లు ఉండి..గుంతలు లేకపోతే ప్రమాదం జరిగి ఉండేది కాదు. ఇప్పటికైన రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యలు తీసుకోవాలి. – ఏకు శంకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, పరకాల

క్లుప్తంగా

దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

శాయంపేట: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగుల కోటపై ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని మాజీ సర్పంచ్, దివ్యాంగుల సంఘం నాయకుడు కందగట్ల రవి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్మితా సబర్వాల్ దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆమె స్థాయికి తగదన్నారు. దివ్యాంగులు కూడా అత్యున్నత స్థాయిలో ఐఏఎస్ అధికారులు, డైరెక్టర్లుగా వారి వారి రంగాల్లో తమ శక్తి సామర్థ్యాలను చాటుతూ ఉన్నత స్థాయి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల మనోభావాలను దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని రవి డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం



శాయంపేట: మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన వేల్పుల సాంబమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సాంబమూర్తితో పాటు 1987–88లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. సాంబమూర్తి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్, లింగమూర్తి, మధు, ప్రతాప్, జంపయ్య, రాంబాబు, శ్యామ్, కుమార్, శివప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, మొగిలి, రాములు, సురేందర్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

శాయంపేట: మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన ఆదిరెడ్డి, తిరుపతి రెడ్డిల తండ్రి గురువారెడ్డి ఇటీవల మృతి చెందగా మంగళవారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు గంటా శ్యాంసుందర్ రెడ్డి, వైద్యుల తిరుపతి రెడ్డి, సాంబరెడ్డి, రాజు, సదానందం, సుభాష్ ఉన్నారు.

బస్ సర్వీస్ ప్రారంభం

నడికూడ: మండలంలోని కంఠాత్మకూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రోడ్డు డైవర్షన్ కోసం తాత్కాలికంగా నిర్మించిన వంతెన కొట్టుకుపోయింది. దీంతో పరకాల–అంబాల మధ్య వాహనదారులకు అంతరాయం కలిగింది. పరకాల, అంబాల, హనుమకొండ బస్సులు వయా నర్సక్కపల్లె, నడికూడ, శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి, అంబాల మీదుగా హనమకొండకు వెళ్లేవి. కాగా రాజుపేట, కౌకొండ, సర్వాపూర్, ధర్మారం, కంఠాత్మకూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండటంతో మాజీ ఎంపీపీ కొంగంటి తిరుపతి స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన డిపో మేనేజర్‌తో మాట్లాడి ప్రతీరోజు పరకాల నుంచి హనుమకొండకు ఉదయం 7, సాయంత్రం 5 గంటలకు హనుమకొండ నుంచి వయా కంఠాత్మకూర్ పరకాలకు బస్ సర్వీస్ ప్రారంభించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

చలివాగు వంతెన పరిశీలన



హన్మకొండ(పరకాల): పరకాల చలివాగు వంతెన వద్ద రోడ్డు మరమ్మతు పనుల్ని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ మంగళవారం పరిశీలించారు. వర్షాలు భారీగా ఉన్న నేపథ్యంలో.. వంతెనలు, చెరువులు, కుంటల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ క్రాంతికుమార్‌ను ఆదేశించారు. ప్రజలెవరూ వాగు దాటకుండా సిబ్బందితో పర్యవేక్షించాలని కోరారు. పరకాల చలివాగు వంతెన జరుగుతున్న రోడ్డు పనుల సమయంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ

వేలేరు (ధర్మసాగర్): ధర్మసాగర్ మండలంలోని కరుణాపురం గ్రామంలో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ), లెప్రా సొసైటీ కార్పొరేషన్‌ల సహకారంతో 60 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులకు టీజీ–స్లాప్ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో డీహెచ్ఈఓ శ్రీనివాస్ చేతుల మీదుగా మంగళవారం అల్సర్‌కిట్స్, టబ్బులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓలు రవీందర్, సతీష్‌రెడ్డి, ఏఎస్ఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కరుణాపురంలో 200 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులు, నిరుపేదలకు, దివ్యాంగులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను టీజీ–స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో రిలైబుల్ ట్రస్టు డైరెక్టర్ రవి, ప్రతినిధులు అందజేశారు. శ్రీనివాస్, ఉపేందర్, సుబ్బారావు ఉన్నారు.

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హరిత తదితరులు

ఎల్కతుర్తి: సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కేస్ వర్కర్ వెన్నిల, హరిత అన్నారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి, ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సఖీ సెంటర్ సిబ్బంది 24 గంటలు పనిచేయనున్నట్లు తెలిపారు. మహిళలకు సమస్య తలెత్తినప్పుడు 181 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. దీని ద్వారా తక్షణ సహాయ, రక్షణ లభిస్తుందన్నారు. మహిళలు చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. గృహహింస, భార్యభర్తలకు కౌన్సిలింగ్, వరకట్నం, లైగింక వేధింపులు, హత్యాచారాలు తదితర వేధింపులకు సంబంధించిన అంశాలకు పరిష్కారాలు లభిస్తాయన్నారు. సమస్యలు ఉన్న మహిళలకు కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సహాయ సఖీ కేంద్రం ద్వారా అందించబడుతుందన్నారు. 0870 2452112 అనే నంబర్‌కు కాల్ చేయడం ద్వారా బాధిత మహిళలకు సహాయం అందించవచ్చన్నారు. బాధిత మహిళలు సఖీ సెంటర్ సేవలను సద్వినియోగ చేసుకోవాలన్నారు. అంతకుముందు 181 టోల్‌ఫ్రీ నంబర్‌తో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీ


వివరాలు సేకరిస్తున్న ఏసీపీ తిరుమల్

కమలాపూర్: మండల కేంద్రానికి చెందిన తుమ్మ లక్ష్మి అనే వృద్ధ మహిళ మెడలోని పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు వెళ్లినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్‌కు చెందిన లక్ష్మి సోమవారం రాత్రి 1 గంట సమయంలో (తెల్లవారితే మంగళవారం) మూత్ర విసర్జన కోసం ఇంట్లోంచి బయటకు రాగా గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని రూ.95 వేల విలువ గల 2 తులాల పుస్తెల తాడు లాక్కెళ్లినట్లు చెప్పారు. బాధితురాలి కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా చోరీ సమాచారం అందుకున్న కాజీపేట ఏసీపీ తిరుమల్ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మానవ మనుగడకు ప్లాస్టిక్ ప్రమాదకరం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సదానందం

వేలేరు(ధర్మసాగర్): మానవ మనుడగకు ప్లాస్టిక్ ప్రమాదకరమని వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు రాజీవ్ రతన్ సింగ్ అన్నారు. మంగళవారం వినియోగదారుల హక్కులు 2019 చట్టానికి సంబంధించిన సమాచార పత్రం, ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించిన పత్రాలను ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సదానందంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయకుల తయారీలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి మట్టి వినాయకులనే పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సమాచారం అధ్యక్షుడు కందుకూరి విజయ్ రావు, విజిలెన్స్ కమిషన్ సభ్యులు కాశిదాసు, చేరాల సర్వేశం, తదితరులు పాల్గొన్నారు.

సోషియాలజీలో డాక్టరేట్


రమాదేవి

కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌కు చెందిన బాసింగాల రమాదేవికి సోషియాలజీ విభాగంలో కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఉప్పల్‌కు చెందిన మొండెద్దుల ప్రకాష్ భార్య రమాదేవి గత 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ పాలిటెక్నిక్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతేడాది ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడంతో ప్రస్తుతం ఆమె జగిత్యాల జిల్లా కోరుట్ల పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంగ్లిష్‌తో పాటు సోషియాలజీలో పీజీ చేయడంతో ఆ విభాగంలో 2018లో పీహెచ్‌డీ ప్రవేశం పొందిన రమాదేవి ఆ విభాగ ఆచార్యులు డాక్టర్ ఐలయ్య పర్యవేక్షణలో 'మల్టీపర్పస్ ఫిమేల్ హెల్త్ వర్కర్స్ ఇన్ హెల్త్ సెక్టార్–ఎ స్టడీ ఇన్ వరంగల్ అర్బన్ డిస్ట్రిక్ట్' అనే పరిశోధనా గ్రంథాన్ని సమర్పించడంతో యూనివర్సిటీ అధికారులు రమాదేవికి డాక్టరేట్ ప్రకటించారు. రమాదేవికి సోషియాలజీలో డాక్టరేట్ ప్రకటించడంతో ఆమె కుటుంబీకులు, బంధువులు, ఉప్పల్ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హర్షం ప్రకటిస్తూ అభినందనలు తెలిపారు.

గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోష్

ఆత్మకూరు: గంజాయి సేవిస్తున్న యువకులను అరెస్టు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు గ్రామానికి చెందిన కక్కు అఖిల్ అనే యువకుడు గూడెప్పాడ్ గ్రామానికి చెందిన కీసర రాజిరెడ్డి, అఖిల్ ఇద్దరు కలిసి పలుమార్లు గంజాయి సేవించేవారు. గూడెప్పాడ్ శివారులో ఎస్సై ప్రవీణ్ వాహనాల తనిఖీ చేస్తుండగా అఖిల్, రాజిరెడ్డి హనుమకొండ నుంచి ఆత్మకూరు వైపు వస్తుండగా పోలీసులను చూసి అఖిల్, రాజిరెడ్డి తప్పించుకునే ప్రయత్నం చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా తమ బ్యాగుల్లో గంజాయి ఉండటంతో అదుపులోకి తీసుకుని విచారించారు. శాయంపేట గ్రామానికి చెందిన యువకుడు గోవింద్ సృజన్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు వారు పోలీసులకు తెలిపారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చాలి

ఆత్మకూరు: ముదిరాజ్‌లను బీసీ 'ఏ' లో చేర్చాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సారంగపాణి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం తహసీల్దార్ జగన్ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ ఏ లో చేర్చాలని లేదంటే ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్, రాజ్ కుమార్, మల్లేశం, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సమ్మయ్యకు అవార్డు


అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ సమ్మయ్య

కమలాపూర్: ఎస్ఆర్ విశ్వవిద్యాలంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కమలాపూర్‌కు చెందిన పుల్ల సమ్మయ్య రీసెర్చ్ అండ్ అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. ఎస్ఆర్ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ ఆర్.గోబినాథ్ మంగళవారం సమ్మయ్యకు అవార్డు అందజేశారు. సమ్మయ్య అవార్డు అందుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

- బీజేపీ మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్

ఎల్కతుర్తి: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పార్లమెంట్ బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మోదీ ప్రభుత్వం అండగా నిలిచిందని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ కొనియాడారు. ఈ సందర్భంగా మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వికసిత భారత్ లక్ష్యంగా పనిచేస్తుందని, దానికి అనుగుణంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం హర్షనీయమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అన్ని వర్గాల ప్రజలకు అండగా కేంద్ర బడ్జెట్ రూపొందించారని కితాబిచ్చారు. ముఖ్యంగా దేశానికి అన్నంపెట్టే రైతన్నను రాజు చేయాలనే ఉద్దేశంతో, వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి బడ్జెట్‌కు పెద్దపీట వేయడం హర్షనీయమన్నారు. మహిళా సాధికారత దిశగా మహిళలను ప్రోత్సహించడానికి ప్రత్యేక శ్రద్ధ చూపారని, బడ్జెట్‌లో మహిళలకు అత్యధిక నిధులు కేటాయించడం దానికి నిదర్శనమన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, మానవ వనరుల అభివృద్ధి, సామాజిక న్యాయం, ఉత్పత్తి సేవలు, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక వసతులు, పరిశోధన అభివృద్ధి, అత్యధిక సంస్కరణలు తదితర విషయాలను పరిధిలోకి తీసుకొని కేంద్ర బడ్జెట్‌ను రూపొందించాలని, దీని ద్వార నరేంద్రమోడీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీట వేసిన ప్రభుత్వంగా చరిత్రలో నిలుస్తుందని వాఖ్యనించారు. ఈ బడ్జెట్‌ను దేశ ప్రజలు సంతోషంగా స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఊసకోయిల కిషన్, గండు సారయ్య, గుండెల్లి సధానందం, శ్రీరామోజు శ్రీనివాస్, అయిత సాయి, బొజ్జపూరి పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు


జెండా ఆవిష్కరిస్తున్న జనార్దన్‌రావు

హన్మకొండ(పరకాల): పరకాల పట్టణంలో బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. దర్జీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా బీఎంఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకుడు ఆడగాని జనార్దన్‌రావు హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దర్జీ సంఘం అధ్యక్షుడు బొమ్మకంటి కుమారస్వామి, నాయకులు చేరాలు, మేఘరాజ, ఓం ప్రకాశ్, మామిడిశెట్టి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంబర్ ప్యాకెట్లు పట్టివేత


అంబర్ ప్యాకెట్లు చూపుతున్న ఎస్సై సాయిబాబు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండల క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నిషేధిత అంబర్ ప్యాకెట్లు పట్టుబడినట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన కాసగోని యాకయ్య, కందిమల్ల వేణుకు చెందిన ఆటోలో నిషేధిత పొగాకు ఉత్పత్తి ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నట్లు వెల్లడించారు. ఇందులో 20 అంబర్, 25 అనార్ ప్యాకెట్లు ఉన్నట్లు తెలిపారు. వీటి విలువ రూ. 18 వేలు ఉంటుందన్నారు. ఆటోతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వేలేరులో..

వేలేరు: మండలంలోని పీచర గ్రామంలో రూ.3,788 విలువ గల అంబర్ ప్యాకెట్లను పట్టికుని సీజ్ చేసినట్లు వేలేరు ఎస్సై డి.హరిత తెలిపారు. మంగళవారం ఎస్సై మాట్లాడుతూ గ్రామానికి చెందిన రాగి సంతోష్, మారబోయిన అశోక్‌లు తమ కిరాణ షాపుల్లో అనుమతి లేకుండా గుట్కా, అంబర్ ప్యాకెట్లను విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతు సహాయ కేంద్రం ఏర్పాటు


దరఖాస్తును స్వీకరిస్తున్న ఏఓ గంగాజమున

శాయంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2 లక్షల రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతగా రూ.లక్ష లోపు రుణమాఫీపై సందేహాల నివృత్తికి శాయంపేట రైతు వేదికలో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి గంగాజమున తెలిపారు. మంగళవారం రైతుల నుంచి ఏఓ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుణమాఫీలో ఎవరైనా రైతులకు రుణమాఫీ కానట్లయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాపాస్ పుస్తకం జిరాక్స్, రైతు వివరాలు, సెల్ ఫోన్ నంబర్, సమస్యలను దరఖాస్తుపై రాసి సమర్పించాలన్నారు. బ్యాంకర్లతో జరిగే సమావేశంలో సమస్యలపై చర్చించి పరిష్కారం చేస్తామని ఆమె తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న రాంరెడ్డి

కమలాపూర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేకాధికారి గూడూరు రాంరెడ్డి సూచించారు. మండలంలోని మాదన్నపేట, శనిగరం గ్రామాల్లో మంగళవారం ఆయన ఆకస్మికంగా పర్యటించి ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, స్కూల్ రిజిస్టర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, గ్రామ పంచాయతీలు, వన నర్సరీలు, వన మహోత్సవం పనులు, ఆయా రికార్డులు తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం అమలును స్వయంగా పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. భారీ వర్షాల కారణంగా తాగు నీరు కలుషితమై గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రతీ ఒక్కరు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు చైతన్య, ప్రవళిక, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడుంబా అమ్మితే పథకాలకు అనర్హులు


ఒప్పంద పత్రాలు తీసుకుంటున్న అధికారులు

హన్మకొండ(పరకాల): గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పరకాల ఆర్డీఓ కె.నారాయణ, పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ హెచ్చరించారు. గుడుంబా తయారీ, విక్రయం కేసుల్లో ఉన్నవారితో పరకాల పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారితో మళ్లీ గుడుంబా విక్రయించమని, తయారు చేయమని ప్రమాణం చేయించారు. ప్రభుత్వ సదుపాయాలు (కరెంట్, నీళ్లు, రేషన్), ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలను నిలిపేయడానికి తమకెలాంటి అభ్యంతరం లేదని వారి వద్ద నుంచి ఒప్పంద పత్రాన్ని తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కమిషనర్ నర్సింహ, ఎంపీడీఓ ఆంజనేయులు, ఏఈ సత్యనారాయణ, ఎక్సైజ్ సీఐ పి.తాతాజీ, ఎస్ఐ రమేశ్, ఎక్సైజ్ ఎస్ఐలు వై.జ్యోతి, డి.సులోచన, సిబ్బంది పాల్గొన్నారు.

మురికి నీరు నిల్వకుండా చూడాలి

- జెడ్పీ సీఈఓ విద్యాలత


నర్సరీని సందర్శించిన విద్యాలత

ఐనవోలు: మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు. మంగళవారం మండలంలోని పంథిని గ్రామాన్ని ఆమె సందర్శించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. నర్సరీలో ఏయే మొక్కలు పెంచారో ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు ఇస్తున్నారా? అని ఆరా తీశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా తీసుకున్న మొక్కల్ని ప్రజలు నాటుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మురికి నీరు నిల్వ ఉంటే ఆయిల్ బాల్స్ వేసి దోమల ఉత్పత్తి పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, ఏపీఓ నక్క కుమారస్వామి, సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేయించండి

- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించిన కౌన్సిలర్


వినతిపత్రం అందజేస్తున్న జయంత్‌లాల్

హన్మకొండ(పరకాల): టీయూఎఫ్ఐడీసీ రెండో విడత ద్వారా మంజూరైన రూ.25 కోట్ల నిధుల నుంచి 21వ వార్డుకు మంజూరైన రోడ్డు పనులను కాంట్రాక్టర్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని 21వ వార్డు కౌన్సిలర్ ఆర్‌పీ జయంత్‌లాల్ పరకాల మున్సిపల్ కమిషన్ కె.నర్సింహాకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గుంతల రోడ్లతో స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని కోరారు.